సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

అల్వాల్: నేరేడ్‌మెట్ డివిజన్ యాప్రాల్‌కు చెందిన భీమేశ్వర్‌రావుకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.2 లక్షల ఎల్‌ఓసీని గురువారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అందజేశారు. బీఆర్ఎస్ నేతలు రాజశేఖర్, మధుసూదన్‌రెడ్డి, రమేష్, నరేష్, నవీన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

నేరాల నివారణకు కృషి

బోడుప్పల్: సీసీ కెమెరాల ద్వారా నేరాలను అదుపు చేయొచ్చని మేడిపల్లి ఎస్సై ఉదయ్‌భాస్కర్ అన్నారు. చెంగిచర్ల 1వ డివిజన్ మాజీ కార్పొరేటర్ బింగి జంగయ్యయాదవ్‌తో కలిసి డివిజన్‌లో గురువారం పర్యటించి సీసీకెమెరాల పనితీరును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సీసీ కెమెరాలను పరిశీలించిన ఆయన సీసీ కెమెరాలన్నింటినీ పనిచేసేటట్లు చేస్తామని పేర్కొన్నారు.

ట్రాన్స్‌జెండర్స్‌కు హెచ్చరిక

అల్వాల్: శుభకార్యాలు, గృహప్రవేశాలు, పండుగలు, వ్రతాలకు ట్రాన్స్‌జెండర్స్ వచ్చి బెదిరింపులకు పాల్పడితే డయల్ -100కు కాల్‌చేసి ఫిర్యాదు చేయవచ్చని నేరేడ్‌మెట్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు. గురువారం నేరేడ్‌మెట్ పోలీస్‌స్టేషన్‌లో పలువురు ట్రాన్స్‌జెండర్లను పిలిపించి వారికి హెచ్చరికలు జారీ చేశారు. శుభకార్యాలకు వచ్చి ప్రజల నుంచి విచ్చలవిడిగా డబ్బులు వసూలు చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేసి, చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వయోవృద్ధులను గౌరవించాలి


గౌతంనగర్: వయోవృద్ధులను ప్రతి ఒక్కరూ గౌరవించాలని సబర్బన్ ట్రైన్ అండ్ బస్ ట్రావెలర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పేర్కొన్నారు. సీనియర్ సిటిజన్స్ డేను పురస్కరించుకుని సబర్బన్ ట్రైన్ అండ్ బస్ ట్రావెలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమాన్‌పేట్‌కు చెందిన వయోవృద్ధుడు ఎస్.నర్సింహ్మారావును గురువారం సత్కరించారు. ఏవీ.స్వామి, నూర్ అహ్మద్, శంకర్‌రావు, వనజ, కనకదుర్గ, పీరన్ తదితరులు పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవ సమితి కన్వీనర్‌గా సునీల్‌రెడ్డి



మల్లాపూర్: నాచారం శాఖ భాగ్యనగర గణేష్ ఉత్సవ సమితి కన్వీనర్‌గా నములికొండ సునీల్‌రెడ్డి ఏకగ్రీవంగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గణేష్ నవరాత్రి ఉత్సవాలను నాచారం డివిజన్‌లో శాంతియుతంగా నిర్వహించేందుకు మండప నిర్వాహకులు సహకరించాలన్నారు. తనపై నమ్మకంతో కన్వీనర్‌గా నియామించినందుకు భాగ్యనగర గణేష్ ఉత్సవ సమితి ఉప్పల్ కో- కన్వీనర్ శ్రీకాంత్, ఫణేందర్, ఉప్పల్ కన్వీనర్ చల్లా ప్రభాకర్, సెంట్రల్ కమిటీ మెంబర్ రెవల్లి రాజుకు కృతజ్ఞతలు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో కార్మికుడి మృతి



అచ్చన్న (ఫైల్)

ఉప్పల్: ఉప్పల్ ఎలిగెంట్ ఫార్మా కంపెనీలో అనుమానాస్పదస్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బాధితులు పోలీసులు తెలిపిన ప్రకారం.. ఉప్పల్ అంబేద్కర్‌నగర్ ప్రాంతానికి చెందిన అచ్చన్న (54) వృత్తిరీత్యా హబ్సిగూడలో ఉన్న ఎలిగెంట్ ఫార్మా కంపెనీలో కాంట్రాక్ట్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. కాగా గురువారం యధావిధిగా ఎలిగెంట్ ఫార్మా కంపెనీకి వెళ్లాడు. ఈ క్రమంలో లోపలే ఉన్నట్టుండి కిందపడి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు కంపెనీకి వెళ్లి నిర్వాహకులను ప్రశ్నించారు. వారు గుండెపోటు, విద్యుదాఘాతమని పొంతన లేని సమాధానం చెప్పడంతో ఆందోళనకు దిగారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

చెరువులో గుర్రపు డెక్కను తొలగించండి

మల్లాపూర్: నాచారం ఎర్రకుంట చెరువులో గుర్రపుడెక్కను తొలగించాలని కోరుతూ గురువారం సీనియర్ ఎంటమాలజిస్ట్ మాధవరెడ్డిని నాచారం డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ నేతలు కలిసి వినతిపత్రం అందజేశారు. మాజీ కౌన్సిలర్ కృష్ణారెడ్డి, గద్ద క్రాంతి కిషోర్, షాహిద్, రషీద్, శంకర్, ప్రవీణ్ పాల్గొన్నారు.

చెరువు పరిరక్షణకు కృషి

ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



కాప్రా చెరువును సందర్శించిన ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, జెడ్సీ హేమంత్ కేశవ్ పాటిల్



నిమజ్జన ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఇన్‌స్పెక్టర్ భాస్కర్‌రెడ్డి

కాప్రా: కాప్రా చెరువు పరిరక్షణకు తాను కట్టుబడి ఉన్నానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్‌పాటిల్‌తో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా చెరువు తూము మరమ్మతులకు గురై నీరు లీకేజీ అవుతుండటంతో ఆయన సొంత నిధులతో నీటి లీకేజీని అరికట్టారు. అనంతరం చెరువు చుట్టూ వాకింగ్‌ట్రాక్ ఏర్పాటు చేయాలని, చెరువును సుందరీకరించాలని జోనల్ కమిషనర్‌కు సూచించారు. దీనిపై స్పందించిన జోనల్ కమిషనర్ చెరువును అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు.

అభివృద్ధి పనులపై..

కాప్రా డివిజన్‌లోని పలు కాలనీలను పరిశీలించిన ఎమ్మెల్యే సమస్యలు పరిష్కరించాలని సూచించారు. కట్టమైసమ్మ-జనప్రియ, సిల్వర్‌క్రెస్ట్-ఎల్లారెడ్డిగూడ మార్గంలో బీటీ రోడ్డుకు బదులు సీసీరోడ్డు వేయాలని అధికారులకు వివరించారు. జీహెచ్ఎంసీ కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జగన్, ఇంజినీరింగ్ విభాగం డీఈ బాలకృష్ణ, ఇరిగేషన్ ఏఈ సుధీర్, అధికారులు, సిబ్బందితో పాటు స్థానికులు ఎంకే.బద్రోద్దీన్, మధుకర్‌రెడ్డి, బైరి నవీన్‌గౌడ్, భాస్కర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన

గణేష్ నవరాత్రులు సమీపిస్తున్న నేపథ్యంలో గణనాథుల నిమజ్జన ఏర్పాట్లపై అధికారులు దృష్టిసారించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి చెరువును సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. నిమజ్జన సమయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం కుషాయిగూడ ఇన్‌స్పెక్టర్ భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసు అధికారుల బృందం కాప్రా చెరువు వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. నిమజ్జన సమయంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నారు. పోలీసు అధికారులు శ్రీనివాస్‌నాయక్‌తో పటు ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు అండగా ఉంటాం

రామంతాపూర్ : రామంతాపూర్ గోకుల్‌నగర్‌లో గత ఆదివారం రాత్రి జరిగిన దుర్ఘటనలో విద్యుదాఘాతానికి గురై మృతిచెందిన సురేష్‌యాదవ్, కృష్ణయాదవ్, శ్రీకాంత్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, రుద్రవికాస్ కుటుంబసభ్యులను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పరామర్శించారు. వారికి అన్ని విధాలా అండగా ఉండి, ఆదుకుంటానని భరోసా ఇచ్చారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం రూ. కోటి పరిహారం, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, అదే విధంగా గాయపడిన వారి ఆరోగ్యం మెరుగయ్యేంత వరకు కార్పొరేటర్ ఆసుపత్రుల్లో ప్రభుత్వ ఖర్చుతోనే చికిత్స అందజేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకొచ్చేందుకు కృషి చేస్తానన్నారు. యాదవ సంఘం, మాజీ అధ్యక్షుడు సర్వబాబుయాదవ్, బీఆర్ఎస్ నేతలు గంధం నాగేశ్వర్‌రావు, సాయిజెనేశేఖర్, మేకల మధుసూదన్‌రెడ్డి, ప్రశాంత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మట్టి గణపతులనే పూజిద్దాం

ఉప్పల్: ఉప్పల్ గణేష్ ఉత్సవ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఆకుల మహేందర్ ఆధ్వర్యంలో ప్రతి ఏటా మాదిరిగా ఈసారి కూడా మట్టి వినాయకుల ప్రతిమలను మొదటి దఫాగా వీఐపీలకు పంపిణీ చేశారు. గురువారం మొదటగా ఉప్పల్ నియోజకవర్గ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి పర్యావరణహితమైన జూట్‌బ్యాగ్‌లో ఉంచిన మట్టి గణపతి ప్రతిమను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పర్యావరణహితమైన మట్టి వినాయకులనే పూజించాలని, ఉత్సవాల్లో ప్లాస్టిక్ కవర్స్‌లాంటి పర్యావరణానికి హాని కలిగించే వాటిని వాడకూడదని సూచించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా సహాయ ఫౌండేషన్ చేస్తున్న కృషిని ఎమ్మెల్యే అభినందించారు. ఉప్పల్ గణేష్ ఉత్సవ సమితి మాజీ అధ్యక్షుడు జెట్ట కిషోర్, భాషపల్లి నిరంజన్‌చారి, రాంరెడ్డి, న్యూ భరత్‌నగర్ కాలనీ అధ్యక్షులు కాడిగే శేఖర్, పాపిరెడ్డి తదితరులున్నారు.



ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి మట్టి గణపతిని అందజేస్తున్న మహేందర్

భద్రతా ప్రమాణాలపై దృష్టి సారించండి



అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ శ్రవణ్

మల్కాజిగిరి: డివిజన్‌లో భద్రతా ప్రమాణాలపై దృష్టి సారించాలని కార్పొరేటర్ శ్రవణ్ విద్యుత్ విభాగం అధికారులకు సూచించారు. గురువారం డీఈ అన్వర్ పాషా, ఏడీఈ చంద్రశేఖర్‌లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సఫిల్‌గూడ నిమజ్జనఘాట్ వెనుక వైపు గేట్ వద్ద ట్రాన్స్‌ఫార్మర్‌కు ఫెన్సింగ్ లేదని, తక్షణమే ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. అనేక చోట్ల ఇంకా ఇనుప స్తంభాలే ఉన్నాయని, వాటి స్థానంలో సిమెంట్ స్తంభాలను ఏర్పాటు చేయాలన్నారు. కేబుల్, ఇంటర్‌నెట్ కేబుల్స్‌ను తొలగించేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ఎవ్వరికీ ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. వినాయక విగ్రహాలు తీసుకెళ్లేటప్పుడు విద్యుత్ తీగలు తగలకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏఈ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆధునిక టాయిలెట్స్, ఈవీ స్టేషన్‌కు స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ త్రిలేశ్వర్‌రావు

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో సువిధ పథకంలో భాగంగా కార్పొరేషన్‌కు రెండు ఆధునిక టాయిలెట్లు, ఈవీ చార్జింగ్ స్టేషన్‌ను నిర్మించేందుకు స్థల సేకరణలో భాగంగా గురువారం నగర కమిషనర్ త్రిలేశ్వర్‌రావు ఆధ్వర్యంలో జాయింట్ డైరెక్టర్ సాయినాథ్, సువిధ టాయిలెట్ ప్రాజెక్ట్ కన్సల్టెంట్‌లతో వరంగల్ హైవేలో రెండు ప్రదేశాల్లో స్థలాలను పరిశీలించారు. డీఈ సాయినాథ్‌గౌడ్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మురుగు సమస్యను పరిష్కరించాలి

అల్వాల్: డివిజన్ శ్రీరామ్‌నగర్ వైష్ణవీదేవి ఆలయం సమీపంలో ప్రధాన రహదారిపై మురుగు పొంగిపొర్లుతోంది. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్‌రెడ్డి జలమండలి అధికారులతో కలిసి మురుగునీరు ప్రవహిస్తున్న స్థలాన్ని పరిశీలించారు. ఈ మురుగునీటి ప్రవాహంతో ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే సమస్యను పరిష్కరించాలని ఆమె అధికారులకు సూచించారు. జలమండలి మేనేజర్ చారి, శేఖర్, ఇమ్రాన్, సాజిద్, యాదగిరి, సునీల్, నర్సింహరావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



వైష్ణవిమాత ఆలయం వద్ద మురుగును పరిశీలిస్తున్న కార్పొరేటర్ శాంతి

ఆలయ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం



బోడుప్పల్: బంగారు మైసమ్మ, నల్లపోచమ్మ, సీతా రామాంజనేయ దేవాలయాల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బొబ్బల లక్ష్మారెడ్డి, ఉపాధ్యక్షులుగా పులకండ్ల బాల్‌రెడ్డి, బొమ్మక్ రమేష్, ప్రధాన కార్యదర్శిగా దేవరకొండ వీరాచారి, పోగుల వీరారెడ్డి, కోశాధికారిగా పొద్దుటూరి నర్సింగ్‌రావు, ఉపకోశాధికారిగా చంద్రారెడ్డి, సింగిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కార్యదర్శులుగా మైసగల్ల కుమార్, సత్యమూర్తి, బలరామ్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా జడిగె మహేందర్‌యాదవ్ ఎన్నికయ్యారు. కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పోగుల నర్సింహ్మారెడ్డి, మాజీ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్, బీ- బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్, బీజేపీ నేతలు రాసాల నర్సింగ్‌రావు గురువారం నూతన కమిటీతో బంగారు మైసమ్మ ఆలయంలో ప్రమాణ స్వీకారం చేయించారు.

పారిశుద్ధ్యంపై అవగాహన



హిల్‌టాప్ కాలనీలో అవగాహన కల్పిస్తున్న దృశ్యం

గౌతంనగర్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే పారిశుద్ధ్యం మెరుగుపడుతుందని, మల్కాజిగిరి సర్కిల్ డీసీ జాకియా సుల్తానా, ఏఎంహెచ్ఓ మంజుల అన్నారు. గురువారం హిల్‌టాప్ కాలనీలో మల్కాజిగిరి శానిటేషన్, 'ఫేకో మత్ నాలెడ్జ్ అండ్ ఇంప్లిమెంటేషన్ పార్ట్నర్స్' ఎన్జీవో సంస్థ, హిల్‌టాప్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్తాధ్వర్యంలో పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించారు. ఇంటి ముందుకు వచ్చే స్వచ్ఛ రిక్షాలలో వ్యర్థాలను వేయాలని హిల్‌టాప్ వాసులకు సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలు పారవేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, జరిమానాలు సైతం విధిస్తామని హెచ్చరించారు. మేధా, ప్రధాన కార్యదర్శి డాక్టర్ జ్యోతిచౌదరి, వెల్ఫేర్ అసోసియేషన్ అంజయ్య, కృష్ణారెడ్డి, ప్రేమ్‌కుమార్, అశోక్‌యాదవ్, మల్లేష్, మేకల రాముయాదవ్, రాజిరెడ్డి, రాజు, నర్సింగ్‌రావు, బిక్షపతి, కాలనీవాసులు సయ్యద్ అలీ, నవాజ్ తదితరులు పాల్గొన్నారు.

గణపతి నవరాత్రులపై సమీక్ష సమావేశం



మాట్లాడుతున్న డీసీ రాజు ఇన్‌స్పెక్టర్ భాస్కర్, నాగరాజు, ఈఈ హరిలాల్ తదితరులు

ఉప్పల్: అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో గణేష్ ఉత్సవాలు విజయవంతంగా నిర్వహించుకుందామని, ఉప్పల్ డిప్యూటీ కమిషనర్ రాజు పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం సర్కిల్ కార్యాలయం మొదటి అంతస్తు సమావేశ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వినాయక మండపాల వద్ద ఏర్పాట్లు, వాటితో పాటు నిమజ్జనం తదితర అంశాలపై చర్చించారు. అన్ని మండపాల వద్ద వీధిదీపాలు, రోడ్లు తదితర అన్ని రకాల సౌకర్యాలను కల్పిస్తామని డీసీ హామి ఇచ్చారు. ఉప్పల్ ఇన్‌స్పెక్టర్ భాస్కర్ మాట్లాడుతూ.. మండపాల నిర్వహకులు విధిగా పోలీసుల అనుమతి తీసుకోవాలని తద్వారా ఎలాంటి సమస్యలు రాకుండా జాగ్రత్తలు వహించవచ్చని సూచించారు. అన్ని మండపాల వద్ద నిర్వహకులు వాలంటీర్లు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది కలగకుండా ఉండేలా అన్ని కూడళ్లలో ప్రత్యేకంగా సిబ్బందిని నియమిస్తున్నట్లు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు తెలిపారు. ఎక్కడ ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటామని చెప్పారు. వినాయక చవితి నాటికల్లా రోడ్లన్నీ గుంతలు లేకుండా చర్యలు తీసుకుంటామని, వీలైతే తారు రోడ్డు కూడా వేస్తామన్నారు. ఈఈ హరిలాల్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, ఎస్సై మాధవరెడ్డి, వివిధ పార్టీల నేతలు, వివిధ విభాగాల అధికారులు తదితరులు, బాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి నేతలు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనుల పరిశీలన

బోడుప్పల్: బంగారు మైసమ్మ దేవాలయం నుంచి ఫ్రీ విలేజ్ వరకు చేపట్టనున్న రోడ్డు విస్తరణ పనులను గురువారం బోడుప్పల్ కమిషనర్ శైలజ, మాజీ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్ పరిశీలించారు. ఈ సందర్భంగా అజయ్‌యాదవ్ మాట్లాడుతూ.. బోడుప్పల్ నగర అభివృద్ధిలో భాగంగా ఈ పనులు చేపడుతున్నట్లు వివరించారు. పెరుగుతున్న జనాభా, వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకుని పనులు త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. మేడ్చల్ నియోజకవర్గ బీ- బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్, నాయకులు పులకండ్ల జంగారెడ్డి, పోగుల దిలీప్‌రెడ్డి తదితరులున్నారు.


హుండీ లెక్కింపు

మల్కాజిగిరి: ఆనంద్‌బాగ్‌లోని లక్ష్మీవేంకటేశ్వర దేవస్థానం హుండీ లెక్కింపు గురువారం దేవాదాయశాఖ పర్యవేక్షణాధికారి మోహన్‌రెడ్డి సమక్షంలో జరిగింది. 78 రోజుల హుండీ సుమారు రూ.4,33,070 ఆదాయం వచ్చిందని ఈవో రవీందర్‌రెడ్డి ప్రకటించారు. హుండీ లెక్కింపులో ప్రధాన అర్చకులు ముడుంబై వేంకటరమణాచార్యులు, అర్చకులు తులసీరమణాచార్యులు, అభివృద్ధి కమిటీసభ్యులు హేమంత్‌కుమార్, రవీందర్‌రెడ్డి, రత్నాకర్, సురేష్‌సింగ్, శ్రీకాంత్ భక్తులు గిరి, సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

మాసశివరాత్రి ప్రత్యేక పూజలు

గౌతంనగర్: మాసశివరాత్రి పురస్కరించుకుని గౌతంనగర్ డివిజన్ ఉత్తమ్‌నగర్‌లోని శ్రీదుర్గా జ్యోతిష్యాలయంలో నిర్వాహకులు నాగరాజు శర్మ ఆధ్వర్యంలో గురువారం ఉదయం శివలింగానికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.


వరద నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి

మల్లాపూర్: మల్లాపూర్ గ్రీన్‌హిల్స్ కాలనీ వరద నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం రూ.27 లక్షలతో ఆర్‌సీసీ భూగర్భ డ్రైనేజీ పైపులైన్ వేస్తున్నామని మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి అన్నారు. గురువారం జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. పనుల్లో వేగం పెంచాలని సూచించారు. డీఈ రూప, ఏఈ స్రవంతి, వర్క్ ఇన్‌స్పెక్టర్ బిక్షపతి, కాలనీవాసులు పాల్గొన్నారు.

జారిపడి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి చేతికి ఫ్యాక్చర్



గాయపడిన పద్మ

మల్కాజిగిరి: దోమల బెడద నివారణకు ఫాగింగ్ చేసే సమయంలో మిషన్ నుంచి డీజిల్ లీకైంది. దీంతో హౌస్ కీపింగ్ సిబ్బంది జారిపడి చేతికి ఫ్యాక్చర్ అయ్యింది. గురువారం ఉదయం కార్యాలయం హౌస్ కీపింగ్‌లో పనిచేసే పద్మ మొదటి అంతస్తుకు వెళ్తుండగా డీజిల్ కనిపించకపోవడంతో కాలు జారి కిందపడింది. ఈ ఘటనలో ఆమె కుడిచేయి మనికట్టు దగ్గర విరిగింది. పక్కనే ఉన్న ప్రభుత్వాస్పత్రికి చికిత్స కోసం వెళ్లగా.. విరిగిన చోట సర్జరీ చేయాలని ఇక్కడ ఆ సదుపాయం లేదని చెప్పారు. సర్కిల్ అధికారులు ఈఎస్ఐ ఆస్పత్రికి వెళ్లి చికిత్స చేయించుకోమని చెప్పారు. తాను పేదరాలినని ఈఎస్ఐలో చికిత్స చేయించుకుంటే సగం జీతం ఇస్తారని కుటుంబ నిర్వహణ ఎలా జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేసింది. నిర్లక్ష్యం వహించిన ఎంటమాలజి సిబ్బందిపై తగిన చర్యలు తీసుకుని న్యాయం చేయాలని ఔట్‌సోర్సింగ్ సిబ్బంది కోరుతున్నారు.

సామూహిక సీమంతాలు

మల్లాపూర్: వారాహిసెల్స్, విబిజే ఫౌండేషన్ ఆధ్వర్యంలో మల్లాపూర్ అంబేద్కర్ భవన్‌లో 108 మంది గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్లు పన్నాల దేవేందర్‌రెడ్డి, ప్రభుదాస్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఒకేసారి 108 మంది మహిళలకు సీమంతాలు చేయడానికి ముందుకొచ్చిన వారాహి, విబిజే ఫౌండేషన్ ప్రతినిధులను ఈ సందర్భంగా అభినందించారు. అల్వాల్ ప్రాజెక్ట్ సీడీపీఓ స్వాతి, సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి, విబిజే ఫౌండేషన్ ప్రతినిధులు రాజు, సత్యవతి, ప్రసన్న, మణిదీప్, స్పందన, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి




పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శాంతిసాయిజెన్‌శేఖర్

మల్లాపూర్: నాచారం డివిజన్ పరిధిలోని అన్నపూర్ణ కాలనీలో రూ.30 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను గురువారం నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డివిజన్‌లో దశలవారీగా సీసీరోడ్లను వేయిస్తున్నామన్నారు. సీసీ రోడ్డు పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న రోడ్డు వేయడంతో కాలనీవాసులు కార్పొరేటర్ కృతజ్ఞతలు తెలిపారు. డీఈ బాలకృష్ణ, ఈఈ వినీత్, వర్క్‌ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్, కాలనీవాసులు యాదగిరి, ఆత్రు, కట్ట బుచ్చన్నగౌడ్, రవి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రీకృష్ణ శోభాయాత్ర

ఉప్పల్: త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక ఉప్పల్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఉప్పల్ గణేష్‌నగర్‌లో శ్రీకృష్ణ శోభాయాత్ర నిర్వహించారు. ×కృష్ణం వందే జగద్గురుమ్‌₹ అంటూ.. నినాదాలు చేస్తూ స్వామివారిని ఊరేగించారు. ఈనెల 16న స్వామివారిని ప్రతిష్టించి అరు రోజుల పాటు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. గురువారం ఊరేగింపుగా మహిళలు, స్థానిక యువత కలిసి సెవెన్‌హిల్స్ కాలనీ మీదుగా తిరిగి స్వస్థలానికి స్వామివారి ఊరేగింపు చేరుకుంది. సేవా సమితి నిర్వాహకులు సరిత, శ్రవణ్‌కుమార్, శ్రీనివాసాచారి, శ్రీలత, స్వరూప, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లోకి చేరికలు



ఎమ్మెల్యే సమక్షంలో పార్టీలో చేరుతున్న యువకులు

అల్వాల్: మాజీ సీఎం కేసీఆర్ నేతృత్వంలోనే తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందిందని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం నేరేడ్‌మెట్ డివిజన్ జేజేనగర్‌కు చెందిన పలువురు యువనాయకులు క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. సాయి విజయ్, మధు, రాకేష్, ప్రవీణ్‌కుమార్, సన్నీ, నాని, కిట్టు ఉన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు సర్వే నరేష్, నవీన్‌రాజు, మధుసూదన్‌రెడ్డి, రాజశేఖర్, విక్రమ్‌గౌడ్, రమేష్, రాజు, అరవింద్ పాల్గొన్నారు.

రోడ్డు సమస్యను పరిష్కరించాలి



ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న స్థానికులు

అల్వాల్: మచ్చబొల్లారం డివిజన్ కీర్తినగర్ కాలనీలో పెండింగ్‌లో ఉన్న ధర్మకాంట నుంచి డీమార్ట్‌కు వెళ్లే గ్రీన్‌ల్యాండ్స్ ఎన్‌క్లేవ్ కాలనీ వరకు రహదారి సమస్యను పరిష్కరించాలని కీర్తినగర్ కాలనీవాసులు గురువారం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి సంబంధిత అధికారులతో మాట్లాడి రోడ్డు పనులు చేపట్టాలని ఆదేశించారు. బీఆర్ఎస్ నేతలు ప్రశాంత్‌రెడ్డి, కాలనీ అధ్యక్షుడు నవీన్‌కుమార్, సభ్యులు శ్రీనివాస్, ప్రభ తదితరులు పాల్గొన్నారు.

నీలిమకు ఓయూ డాక్టరరేట్



హబ్సిగూడ: నగరానికి చెందిన గొరిట్యాల నీలిమ ఓయూ పీహెచ్‌డీ డాక్టరేట్ డిగ్రీ పట్టా దుకున్నారు. కోఠి ఉమెన్స్ కాలేజీలో డిగ్రీ, పీజీ కోర్సులు పూర్తి చేసిన ఆమె ఓయూ ×జనటిక్స్ అండ్ మైక్రోబయోలజీ₹ విభాగం అధ్యాపకులు ప్రొ.సోమేశ్వర్‌రావు పర్యవేక్షణలో ×జీనోమ్ మైనింగ్ ఆఫ్ మైక్రోబాక్టీరియం ట్యూబర్క్యులోసిస్ క్యారెక్టరైజేషన్ ఆఫ్ సఫ్ డిసఫ్ యూ ప్రోటీన్స్ ఆఫ్ ఐరెన్ సల్ఫర్ అసెంబ్లీ పాత్ వే యాస్ నావెల్ డ్రగ్గేబల్ టార్గెట్స్₹₹ అనే అంశంపై పరిశోధనకు డాక్టరేట్ లభించింది. ఇటీవల ఓయూలో జరిగిన 84వ స్నాతకోత్సవంలో ఇస్రో చైర్మన్ డా.నారాయణన్ చేతుల మీదుగా డాక్టరేట్ డిగ్రీ పట్టాను అందుకున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో వర్సిటీ ప్రొఫెసర్ కావాలన్నదే తన లక్ష్యంగా పేర్కొన్నారు.

జీహెచ్ఎంసీ ఆధీనంలోకి షాపింగ్ కాంప్లెక్స్



కాప్రా: ఏఎస్‌రావునగర్ డివిజన్ జై జవాన్ కాలనీలోని షాపింగ్ కాంప్లెక్స్ ఎట్టకేలకు జీహెచ్ఎంసీ ఆధీనంలోకి వెళ్లింది. ప్రభుత్వ నిధులతో నిర్మించిన ఈ షాపింగ్ కాంప్లెక్స్ ఇన్నాళ్లు కాలనీ సంక్షేమ సంఘం ఆధీనంలో ఉండేది. ఈ షాపింగ్ కాంప్లెక్స్‌ను జీహెచ్ఎంసీ స్వాధీనం చేసుకోవాలని గత కొన్నేళ్లుగా స్థానిక నాయకుడు తాడూరి గగన్‌కుమార్ పోరాటం చేశారు. ప్రభుత్వ కార్యాలయాలు, అధికారుల చుట్టూ తిరుగుతూ విజ్ఞప్తులు చేశారు. చివరకు అధికారులు స్పందించి ఎట్టకేలకు షాపింగ్ కాంప్లెక్స్‌ను స్వాధీనం చేసుకుంటున్నట్లు ప్రకటించింది. ఈ నేపథ్యంలో గురువారం జీహెచ్ఎంసీ డిప్యూటీ ఎస్టేట్స్ ఆఫీసర్ లావణ్య షాపింగ్ కాంప్లెక్స్ వద్దకు చేరుకుని 10 షెటర్లకు తాళం వేసి స్వాధీనం చేసుకున్నారు. దీంతో ఇన్నేళ్ల తన పోరాటానికి ఫలితం దక్కిందని, షాపింగ్ కాంప్లెక్స్‌ను జీహెచ్ఎంసీ స్వాధీనం చేసుకోవడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. గత 12 ఏళ్లుగా అద్దె రూపంలో ఇన్నాళ్లు వసూలు చేసిన సుమారు కోటి రూపాయలను వారి నుంచి ప్రభుత్వం రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై అవసరమైతే తాను న్యాయ పోరాటం చేస్తానని స్పష్టం చేశారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220376
9912225470
9912220571